క్లుప్తంగా

విద్యుత్ ఏఈగా గోపీ బాధ్యతల స్వీకరణ



దుగ్గిరాల: మండల విద్యుత్ ఏఈగా కాపారపు గోపీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో వేమూరు మండలంలో పని చేశారు. ఇంత వరకు ఏఈగా పని చేసిన సీహెచ్. వసంతరావు పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోపీకి సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహిళలు సవాళ్లకు ఎదురొడ్డి ఎదగాలి



తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో శుక్రవారం మహిళల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేఎల్‌యూ న్యాయ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ మెగా ఊజా మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి జీవితంలో ఎదగాలని సూచించారు. భారతదేశంలో మహిళల హక్కుల విధాన సంస్కరణలు, అట్టడుగు స్థాయి క్రియాశీలత, న్యాయపరమైన జోక్యం వంటి పలు అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో వీసీలు కె. రాజశేఖరరావు, ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కె.ఆర్.ఎస్. ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ కె. రూతు రమ్య, పూర్వ విద్యార్థులు విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ కె. సోని, న్యాయకళాశాల విభాగాధిపతి పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి, కండ్రిక, రేగులగడ్డ, యర్రగుంట్లపాడు గ్రామాలకు శనివారం మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బైక్ ఢీకొని ఆర్‌ఎంపీకి గాయాలు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): బైక్ ఢీకొని ఆర్‌ఎంపీకి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన డి.జగన్నాథరావు వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో ఆర్‌ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. గురువారం సాయంత్రం లంబాడీపేట సాయిరాం థియేటర్ ప్రాంతానికి వెళ్లిన ఆయన పని ముగించుకుని రోడ్డుపై నిలబడ్డారు. ఇంతలో పాలప్రాజెక్టు నుంచి చిట్టీనగర్ వైపు వెళుతున్న బైక్ వేగంగా వచ్చి ఆయన్ను ఢీ కొట్టింది. దీంతో జగన్నాథరావు రెండు కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు కళ్ల అద్దాలు అందజేత

తెనాలి అర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ప్రవాసా భారతీయుడు కొత్తపల్లి కృష్ణమోహన్ సహకారంతో మారీసుపేట ఎస్‌సీఆర్ ఎస్ఎంహెచ్ స్కూల్, పెదరావూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం 175 కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, మల్లాది అర్జున్, పాలడుగు సురేంద్ర, కన్నెగంటి మురళీకృష్ణ, ఆలపాటి కిరణ్‌చౌదరి, వీరవల్లి శ్రీధర్, పాల్గొన్నారు.

వాహన యజమానులకు కౌన్సెలింగ్



తెనాలి రూరల్: తెనాలిలో గురువారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీలలో సీజ్ చేసిన వాహన యజమానులకు డీఎస్పీ జనార్దనరావు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ కార్యాలయం వద్దకు వాహనదారులను పిలిపించి వారితో మాట్లాడారు. సీజ్ చేసిన వాటిలో సరైన నంబర్ ప్లేట్లు లేని అనేక వాహనాలను గుర్తించామని ఆయన తెలిపారు. పట్టణ పరిధిలో వాహనాల తనిఖీ కొనసాగుతుందని.. యజమానులు సరైన పత్రాలు కలిగి ఉండడంతో పాటు అందరూ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

బాబు పాలనలో ప్రజల భవిష్యత్తు అంధకారం

నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



నిడమర్రులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వేమారెడ్డి, నాలి వెంకటకృష్ణ తదితరులు



ఆత్మకూరులో క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న వేమారెడ్డి తదితరులు

మంగళగిరి: చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలకు భవిష్యత్తు లేకుండా పరిపాలిస్తున్నాడని నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ధ్వజమెత్తారు. మండల పరిధిలోని నిడమర్రు, ఆత్మకూరు గ్రామాల్లో శుక్రవారం రాత్రి 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు నో గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షత వహించారు.తొలుత నిడమర్రు సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి , మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వస్తే ఎంత లబ్ధి చేకూరుతుందో వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కంటే అధికంగా లబ్ధి చేకూరుతుందంటూ ప్రచారం చేశారని తెలిపారు. తీరా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏ ఇంటికీ ఒక్క రూపాయి లబ్ధి చేకూరకపోవడంతో ఏడాదిలోనే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని పేర్కొన్నారు. ఇపుడు కూటమి నాయకులకు ఇళ్లకు కాదు కదా.. గ్రామాలలోకి వెళ్లే దమ్ముందా? అని నిలదీశారు. టీడీపీ నాయకులు వీధిలో తలెత్తుకుని తిరిగే పరిస్థితి లేదన్నారు. ఎక్కడకెళ్లినా ప్రభుత్వాన్ని , టీడీపీ నాయకులపై ప్రజలు తిరగబడతున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్‌తో చంద్రబాబు ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేశారని ప్రజలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు నో గ్యారంటీ కార్యక్రమాలకు ప్రజలే స్వయంగా పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వంపై ధ్వజమెత్తుతున్నారని వేమారెడ్డి పేర్కొన్నారు. ఇన్ని సంవత్సరాల రాజకీయాల్లో ఒక ప్రభుత్వంపై ఇంత పెద్దఎత్తున వ్యతిరేకత రావడం ఎన్నడూ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గాదె సుబ్బారెడ్డి, జంగా నాగిరెడ్డి, మండెపూడి యోహాను, మండెపూడి బుజ్జి, విష్ణువర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ యువజన షేక్ గౌస్, యువజన రూరల్ అధ్యక్షుడు మాగుడుల గోపిరెడ్డి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పంతగాని రమేష్, ఆర్ధల చిన్నారి, ఎం విజయకుమార్, దుర్గనాయక్, కె. భూషణం, షేక్ ఫిరోజ్, షేక్ బాజీ, జిల్లా యాక్టివిటీ సభ్యురాలు మల్లవరపు సుధారాణి, జాలాది నాగేశ్వరరావు, పార్టీ రూరల్ ఉపాధ్యక్షుడు బొమ్ము సాంబిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, పి. సాంబిరెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ



తాడేపల్లి రూరల్: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులకు స్మార్ట్ మీటర్ల వల్ల అనర్థాలను వివరించారు. సీఐటీయూ తాడేపల్లి మండల నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న నారా లోకేష్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించారని, మీటర్లను పగలకొట్టాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మోదీ విధానాలను అమలు చేస్తూ, ప్రజలపై విద్యుత్ భారాలు వేస్తోందని తెలిపారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5న జరిగే నిరసనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూతాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, కేవీపీఎస్ నాయకులు నాగపోగు విజయరాజు, జి. బాలు, పాటిబండ్ల సత్యనారాయణ, నాగరాజు, ఏసుపాదం, రవి పాల్గొన్నారు.

మేడికొండూరులో..

ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ సీపీఎం మండల కార్యదర్శి రామకృష్ణ శనివారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండని ప్రచారం చేశారని గుర్తు చేశారు.ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటినే ప్రభుత్వ ఆఫీసులు, వ్యాపార సంస్థలకు బిగించారని మండి పడ్డారు. ఇప్పుడు ఇళ్లకు కూడా బిగించేందుకు సిద్ధమయ్యారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఏదైనా విద్యుత్ సమస్యపై ఫిర్యాదు చేయాల్సి వస్తే ఎక్కడకు వెళ్లి చేయాలో తెలియని పరిస్థితి వస్తుందని వివరించారు. అనంతరం స్మార్ట్ మీటర్లు బిగించ వద్దంటూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. అనంతరం మేడికొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అధికారులకు అందించి, నిరసన వ్యక్తం చేశారు.

బాబును నమ్మిన వారికి మోసం గ్యారంటీ

వైఎస్సార్ సీపీ తాడికొండ మండల అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్



తాడికొండ జయభారత్ కాలనీలో జరిగిన సభలో మాట్లాడుతున్న మనోహర్



పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు

తాడికొండ: బాబు ష్యూరిటీ ఇస్తే నమ్మిన వారందరికీ మోసం గ్యారంటీ అనేందుకు ప్రస్తుత పాలనే నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ మండల అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్ అన్నారు. తాడికొండ జయభారత్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ రచ్చబండ- చర్చా వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సూపర్ సిక్స్ పేరుతో ఊకదంపుడు హామీలిచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేశాడా ? అని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకాన్ని ఏడాది తర్వాత హామీ అమలు చేసిన బాబు అందరికీ ఖాతాలలో డబ్బులు వేయకుండా మోసం చేశాడని తెలిపారు. రైతు భరోసా, పెట్టుబడి సాయం అందించకుండా రైతుల్ని ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కనీసం పండిన పంటకు గిట్టుబాటు ధరలు కూడా రాకుండా వ్యాపారస్తులకు మాత్రమే న్యాయం జరిగేలా చేసి నిలువునా ముంచాడని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు హామీ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు రూ.1500 ఇస్తానని చెప్పిన బాబు.. ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్నాడని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయని ఆయనకు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బాబు బడా పారిశ్రామిక వేత్తలకు దాసోహం అవుతున్నారన్నారు. బడా బాబులకు దోచిపెట్టి పేదలను నిలువునా అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని తెలిపారు. ప్రశ్నించిన వారిని అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజల కోసం వైఎస్సార్ సీపీ పోరాటం చేయడం మానదని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలో రైతులు, రైతు కూలీలకు తరతరాలుగా నమ్ముకున్న భూములను దూరం చేసేందుకు పూలింగ్ పేరుతో లక్షలాది ఎకరాలు సేకరణ అంటూ ప్రకటనలు చేయడంపై మండిపడ్డారు. పేదలను దోచి, పెద్దలకు పెట్టే తప్పుడు ఆలోచనలు మాని, సక్రమంగా పాలించకపోతే ఈ ప్రాంత ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ముప్పాళ్ల మనోహర్ హెచ్చరించారు.

కార్యక్రమంలో పార్టీ గ్రామఅధ్యక్షులు వంగా పోలారెడ్డి, మండల ఉపాధ్యక్షులు నల్లిబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు ధూళిపాళ్ల నాగేశ్వరరావు, వలపర్ల కల్పన, నియోజకవర్గ రైతు విభాగం నాయకులు మల్లంపాటి రాఘవ రెడ్డి, యువజన విద్యార్థి విభాగం మండలఅధ్యక్షులు షేక్ అజీస్, మల్లంపాటి చంద్రశేఖర్ రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ బాబావలి, జాని, వివిధ విభాగాల నాయకులు ఇసుకపల్లి రమేష్, పులి రమేష్, దమ్మాటి మోహనరావు, బాకి వెంకటస్వామి, ముచ్చు ఆనంద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో మ్యూటేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా



మ్యూటేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ అలీమ్ బాషా, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆటో మ్యూటేషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా కోరారు. మంగళగిరి పట్టణ పరిధిలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఆటో మ్యూటేషన్ ప్రక్రియను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె. బాలగురవయ్యతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన ఆటో మ్యూటేషన్‌తో ఆస్తి పన్నుల వివరాల్లో మార్పుల ప్రక్రియ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ విధానం ద్వారా యజమాని పేరు మార్పులు చేయించుకోవచ్చని వివరించారు. గతంలో అమ్మిన, కొన్న వారి పేర్లు మార్చుకునేందుకు నగరపాలక సంస్థ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలని తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలుకుతూ మ్యూటేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ తరువాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు,ప్రాపర్టీ టాక్స్‌ల రికార్డులు తక్కువ సమయంలో చేరతాయని చెప్పారు. ప్రజలకు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారి మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

వరాలివ్వు.. వరలక్ష్మి తల్లి !



పాత మంగళగిరి కనకదుర్గమ్మ ఆలయంలో..



పసుపు యార్డు సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



హుస్సేన్ కట్ట వద్ద ఉన్న కనక దుర్గమ్మ ఆలయంలో..

వైభవంగా శ్రావణ పూజలు

మంగళగిరి: పాత మంగళగిరి జాతీయ రహదారి వెంట కల కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమపూజ,లలిత సహస్రనామ పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ భక్త బృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

తాడేపల్లి రూరల్‌లో..

మంగళగిరి పట్టణ పరిధిలోని హుస్సేన్ కట్ట వద్ద ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవాలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన నిర్వాహకురాలు వాకా ప్రభావతి, చైర్మన్ వాకా మంగారావు మాట్లాడుతూ శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి శ్రీసూక్తం, ఖడ్గమాల, శ్రీ లక్ష్మీ ష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించామని తెలిపారు. భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారని, ఆలయం తరపున మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, రవికలు, తాంబూలాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో భక్త బృందం ప్రతినిధులు కె. రంగనాయకి, ఆషా, శ్రీలక్ష్మి, బేబి, రామకుమారి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

స్థానిక పసుపు యార్డు సమీపంలోని శ్రీ కళ్యాణం వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు సాకేత్ శర్మ, రామచంద్ర పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పర్యవేక్షించారు.

హెచ్‌ఎంగా సుబ్బారావు సేవలు ప్రశంసనీయం



సుబ్బారావు, సుకన్య దంపతులను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడిగా గుండ్ర సుబ్బారావు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యారంగానికి సుబ్బారావు చేసిన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి బాధ్యతతో కూడుకున్నదని పేర్కొన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో, వారి బంగారు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయడంలో సుబ్బారావు కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఆయన వద్ద చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని తెలిపారు. అనంతరం సుబ్బారావు, సుకన్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



నుదురుపాడులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వెద్యులు యానీ గ్రేస్, సబీరాబేగం

తాడేపల్లి రూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యమని మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సరిత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మంగళగిరి మున్సిపాలిటీ సెక్టార్ పరిధిలోని గండాలయపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సరిత మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి, బిడ్డకి మంచిదని వివరించారు.పోత పాలు అంత మంచిది కాదని, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బిడ్డకు ఇవ్వాలని తెలిపారు. గణపతినగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు అనూష మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లి క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చని వివరించారు. పిల్లల్లో తెలివితేటలు, సామర్థ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ సౌమ్య, మంగళగిరి మున్సిపాలిటీ సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎయిమ్స్ సిబ్బంది, మున్సిపల్ సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

మండలంలోని నుదురుపాడులో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు యానీగ్రేస్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాల కంటే శ్రేష్టమైనవి ఏవీ లేవని చెప్పారు. తల్లిపాలు తాగడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగుంటుందని, వ్యాధినిరోధక శక్తి వారిలో పెరుగుతుందని తెలిపారు. ప్రసవం అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్. మహాలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద చౌడయ్య, వైద్యురాలు సబీరాబేగం, సీహెచ్‌వో ఎన్. వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు చిన్నమ్మాయి, హెచ్ఎస్ కె.సుదర్శనరాజు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- మండల కేంద్రంలోని 15వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో అనూరాధ తల్లిపాల విశిష్టతను బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం



మంగళగిరిలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

మంగళగిరి :ప్రతి తల్లి తప్పనిసరిగా పిల్లలకు పాలు ఇవ్వాలని సిడిపివో సరిత తెలిపారు. పట్టణంలోని గండాలయపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, పిల్లల్లో తెలివితేటలు సామర్థ్యాలు తల్లిపాలు తాగడం వలన మెరుగుపడతాయని తెలిపారు. డాక్టర్ పి అనూష మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లి తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన తల్లీ బిడ్డకు ఎంతో ప్రయోజనమన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజక్టు ఏసిడిపివో సౌమ్య,సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఎయిమ్స్ సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు. గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో అధిక ఆదాయం



పుట్టగొడుగుల పెంపకాన్ని వివరిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారులోని లాంఫాంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో శుక్రవారం కోర్స్ డైరెక్టర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవి మాట్లాడుతూ పుట్టగొడుగుల స్పాన్ ఎలా తయారు చేయాలో వివరించారు. పాల పుట్టగొడుగులు, ఆయిస్టర్, వరిగడ్డి, బటన్ పుట్టగొడుగుల తయారీ, వాటి పోషక విలువలు ఆరోగ్య ప్రయోజనాలు, మార్కెట్ డిమాండ్ గురించి వివరించారు. వీటిలో ప్రోటీన్స్ (19- 35%) వరి, గోధుమ, కూరగాయల కంటే అధికంగా ఉంటాయని, పొటాషియం, సోడియం నిష్పత్తి, పీచు పదార్థాలు అధికంగా ఉండడం వల్ల అధిక రక్తపోటు (బి.పి.), అధిక ఆమ్లత (అసిడిటి) వల్ల బాధపడే వారికి చాలా బాగా ఉపయోగపడుతాయన్నారు. పుట్టగొడుగులలో కొవ్వు పదార్థాలు తక్కువగా వుంటాయని, తాజా పుట్టగొడుగులలో విటమిన్-డి అధికంగా ఉంటుందని తెలిపారు. పుట్టగొడుగుల తయారీకి ఎక్కువ పెట్టుబడి అవసరం లేదని, పుట్టగొడుగులను 35-40 రోజులలో పెంచవచ్చన్నారు. ఇంటి ఆవరణంలో కూడా వీటిని సులభంగా పెంచవచ్చని, అధిక దిగుబడులు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పంట అయిపోయిన తరువాత దిండ్లను ఎరువుగా లేదా బయోగ్యాస్ తయారీకి వాడుకోవచ్చని, గ్రామీణ నిరుద్యోగ యువత, మహిళలు, సన్నకారు రైతులు పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టినట్లయితే అధిక దిగుబడులను పొందడమే కాకుండా, ఉపాధిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలి టౌన్: తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీ అయిన అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో విజయగౌరి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలో 7 అంగన్‌వాడీ ఆయా పోస్టులు, ఒక టీచర్ పోస్టుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. అర్హత 10వ తరగతి పాసై ఉండాలని.. 21 నుంచి 35 ఏళ్ల వయస్సు, వివాహం అయ్యి ఉండాలని.. స్థానికత ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టు కోపల్లె, ఆయా పోస్టులు సిరిపురం, అన్నవరం, కొలకలూరు, కోపల్లె, తెనాలి టౌన్ 14వ వార్డు, 31వ వార్డు, 38వ వార్డు పరిధిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు స్థానిక గ్రామ, వార్డు సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించి దరఖాస్తు చేసుకునేందుకు సమాచారం తెలుసుకోవాలని ఆమె కోరారు.